# ప్రవాసాంధ్రుల పేజీ

- సి.హెచ్ ఉదయ్.

అమెరికాలో వివిధ నగరములలో జరుగుతున్న విశేషాలతో పొందుపరచిన ప్రవాసాంధ్రుల పేజీని మీకు అందించాలనే మా ప్రయత్నానికి ఈసారి ఓ ఆకృతి ఏర్పడింది. సెయింట్ లూయిస్ నగరములోని విశేషాలతో దీనిని మొదలు పెడుతున్నాము. త్వరలో మిగిలిన ప్రదేశాలలో జరిగే కార్యక్రమాల గురించి కూడా ఇందులో ప్రచురించే ప్రయత్నం చేస్తాము.

**పరమహంస శ్రీ నిత్యానంద స్వామీజీ.**

**తేదీ : ఏప్రియల్ 25 - 27, 2007 సమయము : సాయంత్రము 7 గంటలకు**

**స్థలము : మహాత్మ గాంధి కల్చరల్ సెంటర్, సెయింట్ లూయిస్.**

25వ తేదీ అంశము : ప్రేమతత్వం వైపు గమనం - మనస్సుపై విజయం (Move towards Love –Win over your mind).

26వ తేదీ అంశము : శబ్దము - సున్నిత తత్వం - నిశ్శబ్ద స్థితితో శృతిచేసికొనుట (Sensitivity – with Sound – Attune to soundlessness).

27వ తేదీ అంశము : అంతరాళములలోనుండి ఉపశమనము - జీవితగమనం సాగనీ (Relax from Deep Within – Let go of Life).

**తేదీ : ఏప్రియల్ 28-29, 2007 సమయము : ఉదయం 9 గంటల నుండి అర్ధరాత్రి వరకు.**

**స్థలము : ఎకొనోలాడ్జి.**

అంశము : ఆత్మ స్ఫురణ - ఆత్మతో అనుసంధానము (వారాంతపు ధ్యాన సాధన).

శివ సూత్రముల నుండి కొన్ని విషయములను ప్రవచించి, అనంతరము వాటికి సంబంధించిన ధ్యానమును తెలియజేసారు. ఇందులో స్వామీజీ ప్రస్థావించిన పలు అంశములు తిరిగి క్లుప్తంగానైనా తెలియజేయడం చాలా కష్టం. అంతా మన మంచికే అనే సామెతను చెబుతూ, కష్టములు కలిగినపుడు వాటిగురించి చింతిస్తూ, సుఖములు కలిగిన నాడు వళ్ళు తెలియని విధముగా బ్రతుకు వెళ్ళదీయడమనేది సరియైన పద్ధతి కాదని తెలియజేసారు. భగవద్గీతలో కృష్ణ భగవానుడు ఉపదేశించినట్లు కష్టసుఖములకు, రాగద్వేషములకు అతీతుడుగా తామర ఆకుపై నీటిబొట్టులా సమాజములో జీవిస్తూ కూడా దాని ప్రభావానికి లోను కానివాడు స్థితిప్రజ్ఞుడు. కావాలనుకున్నది కాకపోవడము, జరగకూడదు అనుకున్నది జరగడము దు:ఖహేతువులు. కాని జరుగుతున్నది అంతా మన మంచికే అని అనుకోవడమువల్ల పరిస్థితులు చక్కబడే అవకాశము ఉంది. మనము విశ్వశాంతిని కాంక్షిస్తే, విశ్వములో భాగమైన మనకు కూడా శాంతి లభిస్తుంది. ఇది క్లుప్తముగా నేను అర్థము చేసుకున్న సారము మాత్రమే.

**తేదీ : మే 11 వ తేదీ 2007 సమయము : సాయంత్రము 7 గంటలు**

**స్థలము : సెయింట్ లూయిస్ హిందూ దేవాలయ ప్రాంగణము**

**కళాకారులు : శ్రీ బి. కె. అనంతరామ్ (B.K. Anantha Ram), అమిత ఎ. నదిగ్ (Amitha A. Nadig) మరియు ప్రసాద్ (Prasad).**

మనము మన ఊపిరి తీసుకోవడములోనే ఒక క్రమము పాటించలేము. అలాంటిది మనము మన ఉచ్వాస, నిశ్వాసములు క్రమబద్ధీకరిస్తే ఆరోగ్యము గురించి అంతగా పట్టించుకోనవసరము లేదు. మే 11 వ తేదీన సెయింట్ లూయిస్ హిందూ దేవాలయ ప్రాంగణములో అనంతరామ్ మరియు అమిత్‌లు మురళికి ఊపిరులూది సప్త స్వరములను ఆవిష్కరించి ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేసారు. ఈ కార్యక్రమమును మొదట 'వాతాపి గణపతిం భజే' అంటూ గణేష ప్రార్థనతో మొదలుపెట్టారు. తరువాత త్యాగరాజస్వామి వారి 'ఎందరో మహానుభావులు' కీర్తనను, 'నీ నగు మోము గనలేని' కీర్తనను, 'సీతారాముల కళ్యాణం చూతము రారండి' వంటి కీర్తనా సమాహారాన్ని పంచి ప్రేక్షకులకు వీనులకు విందు, మనసుకు పసందు కలిగేటట్లు చేసారు. ప్రసాద్ గారు మృదంగ సహకారము అందజేసారు.

## మేడసాని మోహన్ గారి అవధానము

**తేదీ : జూన్ 15 సమయము : సాయంత్రము 7 గంటలకు**

**స్థలము : సెయింట్ లూయిస్ హిందూ దేవాలయ ప్రాంగణము**

కార్యక్రమము 'వాతాపి గణపతింభజే', 'సుగుణ భూషణ రామా' ప్రార్థనలతో ప్రారంభమైనది. శ్రీ వేమూరి వేంకట రామనాధంగారి అధ్యక్షత వహిస్తూ తిరుమల తిరుపతి దేవస్థానము వారిచే ముద్రించబడిన వారి 'సన్నుతి' నుండి ఒక పద్యమును చెబుతూ వేంకటేశ్వర ప్రార్థన గావించారు. వారి క్లుప్తమైన సంభాషణ అనంతరము అవధానిగారిని వేదికపైకి ఆహ్వానించడము జరిగింది. అవధానిగారు అన్నమాచార్య ప్రాజెక్ట్‌నకై తిరుమల తిరుపతి దేవస్థానములో పనిచేయుచున్నారు.

ఈ కార్యక్రమములో నిషిద్దాక్షరి అంశమునకు దేవాలయ అర్చకులు శ్రీ శ్రీనివాస్ దీవి గారు, న్యస్థాక్షరి అంశమునకు శ్రీ తెలుగుంట్ల కుమార్ రెడ్డిగారు, కావ్య పఠనము/పురాణ పఠనమునకు శ్రీ లేపాక్షినాథ్ జీలకర్రగారు, ఆశువునకు శ్రీమతి లలిత మలత్కర్‌గారు, దత్తపదికి శ్రీ రవి పసుపులేటిగారు, వర్ణనాంశమునకు శ్రీ ఎం.వి. కృష్ణారావుగారు, అప్రస్థుత ప్రసంగమునకు శ్రీ తాతా ప్రసాద్ గారు, సమస్యకు శ్రీనివాసరావు అయినాపురపు పృచ్ఛకులుగా వ్యవహరించారు. అవధానిగారు మెఱపువేగముతో సమస్యలను పూరించడం జరిగింది. అవకాశము చిక్కిన మేరకు వారు పూరించిన పద్యములను మీకు అందించే ప్రయత్నం చేస్తున్నాము. తప్పులేవేని దొర్లిన ఎడల మన్నించమని మనవి.

**నిషిద్ధాక్షరి** : వేంకటేశ్వర అవతారానికి ముందు భృగు మహర్షి, మొదలైన వారు యజ్ఞం చేయడానికి నిశ్చయించి, భృగు మహర్షిని శివ విష్ణువులను కలిసి రమ్మని పంపడం జరిగింది. భృగు మహర్షి బ్రహ్మ, శివలోకములు వెళ్ళి, విష్ణువును దర్శించు సందర్భములో కోపోద్రిక్తుడై హరిని హృదయముపై తన్నాడు.

అప్పుడు లక్ష్మీదేవి వేదనను ఉత్పలమాల వృత్తములో చెప్పుమని అడగడం జరిగింది. అవధానిగారి పద్యము క్రింద గమనించండి.

**మొదటి పాదము:**

శ్రీ (ని)వ(చ)ర(శ్రీ)భా(టి)వ(ము)నా(మ)జ(న)గ(ము)తి

(**)చిన్మ(మ)హిమా(ను)ర్ద్రి(ము)క(మ)ళా(ది)ప్ర(వి)భా(వ)ద్య(మున్)తన్

**రెండవ పాదము:**

(ల)ధీవి(భ)ధి (మ)పా(దు)ర(మె)సం(భ)గ(మ)ర(ము)హిదే(హా)ర్బి (త)ము(ద)నీ(శ్వ)ధ్యుని

(కృ)ప(వి)త్ని(సం)నింతగన్

**మూడవ పాదము:**

(ల)రావ(ము)వి(వి)భా(తి)ప్ర(భా)కా(శ)మ(హి)న(హి)లరం(జి)గ(శ్రీ)ము (ని)స(ద్య)ప్త(గు)మ(టి)హీ(మ)ద్ర

(భు)దే(వ)శ(మున్)రాత్

**నాలుగవ పాదము:**

పావనమూర్తి వేంకట శుభంకరమూర్తి నుతింతు నిత్యమున్

* అవధానిగారి వేగముగా చెప్పడము వలన కొన్ని నిషిద్ధ అక్షరములు రాసుకునే అవకాశము కలుగలేదు.

** ప్రతి పాదములోనూ 1వ అక్షరము, 10 వ అక్షరము యతిమైత్రి కలిగి ఉండాలి. కావున నిషిద్ధ అక్షరము ఇవ్వలేదు.

కావున పూర్తి అయిన పద్యము క్రిందనీయబడినది.

*ఉ. శ్రీ వరభావనాజగతి చిన్మహిమార్ద్రికళాప్రభాద్యతన్*
*ధీవిధి పారసంగరహిదేర్బి మునీధ్యుని పత్నినింతగన్*
*రావవిభాప్రకామనలరంగము సప్తమహీద్ర దేశరాత్*
*పావనమూర్తి వేంకట శుభంకరమూర్తి నుతింతు నిత్యమున్.*

**న్యస్తాక్షరి** : మొదటి పాదం నాలుగవ అక్షరం 'క', రెండవ పాదం ఎనిమిదవ అక్షరం 'చ', మూడవ పాదం పన్నెండవ అక్షరం 'ట', నాల్గవ పాదం పదహారవ అక్షరం 'త' వచ్చేటట్లుగా 'కారుమబ్బులు కమ్మి, ఇక ఏ క్షణమైనా కుంభవృష్టి కురుస్తుందనేటట్లున్న పరిస్థితిలో, తలదాచుకొనడానికి వీలులేని నిర్మానుష్యమైన ప్రదేశములో, కనీసం ఒక చెట్టైనా కనిపించని ప్రదేశములో గొడుగు కూడా లేని ఒక బాటసారి పరిస్థితిని చంపకమాల వృత్తములో వర్ణించుమని అడుగగా అవధానిగారు చెప్పిన పద్యము

*చం. ధరణి కళా విశేషముల దార్కొణ దీప్తియుక్తమే*
*అరుదుగ నేటి నా చరితమయ్యదికోరగ చిత్రయుక్తిమై*
*పరుగులు వెట్టుచున్నయది పాటవమున్ విడనాడిమేఘుడా*
*శిరమున ఛత్రమేమియు రచింపనివాని తపింపచేతువా?*

**దత్తపది** : పులకరింత, జలదరింత, వెక్కిరింత, కలవరింత ఉపయోగించి కొంటె మొగుడు పెంకి పెళ్ళానికి కన్నీరు పెట్టించుమని అడుగగా

*ఉ. పీడిత హేల్లమై పులకరింతలుగా తన ప్రేయసీమణిన్*
*శ్రేడులు మీరగా జలధరింతల వింతట హర్షభాష్పముల్*
*రాణరహించుచుండ మధురంబుగ మారుని ఎక్కిరింతయై*
*శ్రేణి వహింపగా కలవరింతలు పూవులభాణపంక్తులే.*

మొదటి పాదంలో ' ప్రే' ఉండడమువలన ఛందస్సు కుదరడం లేదు. అక్కడ గురువు ఉండాలి, గాని వత్తు తగదు. వ్రాసుకోవడములో పొరపాటు జరిగి ఉండవచ్చు. గమనించ ప్రార్థన.

**సమస్యాపూరణము** : 'రాతిని పెండ్లిచేసుకొనె రాముడు సందడి మిన్నునంటగా' అని నాల్గవ పాదమునిచ్చి, పూరించుమని అడుగగా అవధానిగారి సమాధానము.

*ఉ. భాతి ధనుర్విభంగరసభాసురకీర్తిలతా సమేతుడై*
*ఖ్యాతి వహించు దేవుని సముంచితమౌ అనురక్తిమీరగా*
*ఆతత నిత్యసుందర సుఖాంగిత భావకళాస్ఫురన్‌గుణా*
*రాతిని పెండ్లిచేసుకొనె రాముడు సందడి మిన్నునంటగా.*

**వర్ణన** : సెయింట్‌లూయిస్ నగరములో ఒక విశేషమున్నది. ఇక్కడ దేవాలయమున్న రహదారిలోనే ఓ మసీదు (మహమ్మదీయ ప్రార్థనా స్థలము), చర్చి (క్రిష్టియన్ ప్రార్థనా స్థలము) ఉన్నాయి. ఒకసారి ఓ మహమ్మదీయుడు, క్రైస్తవుడు ఆ రహదారిగుండా వెళుతూ, కిటకిటలాడుతున్న దేవాలయప్రాంగణమును గమనించి, విశేషమేమిటోనని తెలుసుకునే ఉద్దేశ్యముతో దేవాలయములో ప్రవేశించారు. శ్రీ వేంకటేశ్వరుని విగ్రహము ఎదురుగా నిలుచున్న వారు తన్మయత్వమునకులోనై వారికి అల్లా, క్రీస్తు అక్కడే అగుపించినట్లు భావన కలిగింది. ఈ సన్నివేశమును వర్ణిస్తూ ఉత్పలమాల వృత్తములో పద్యము చెప్పుమని కోరడం జరిగింది.

*ఉ. అల్లమనోజ్ఞహాసమున అద్భుతరూపుడు వేంకటేశుడే*
*ఎల్లరుమెంచు క్రిష్ణసముదీరిత తేజమునొప్పుమీరగా*
*సల్లలితాదిమోదమున సాగిరి ముస్లిము సోదరుండు సం*
*ఫుల్లదృఢంబజాలముల కొల్వువహించు మహమ్మదీయుడున్.*

**కావ్యపఠనము** : ఈ అంశములో పృచ్ఛకుడు అడిగిన మూడు పద్యములను గురించి అవధానిగారువర్ణించారు. పృచ్ఛకుడు మొదటిది బమ్మెర పోతనగారి 'ఆంధ్రమహాభాగవతము' నుండి, రెండవది ధూర్జటి గారి 'కాళహస్తిమహత్యము' నుండి, మూడవది శ్రీకృష్ణదేవరాయులు అందించిన తెలుగు పంచ మహాకావ్యములలో ఒకటైన 'ఆముక్తమాల్యద' నుండి గ్రహించారు.

**ఆశువు** : ఇందులో అడిగిన 'నవరత్నాల పేర్లు ఉపయోగించి రామునిపై పద్యము'ను, 'సన్యాసి గొప్పవాడా? సంసారి గొప్పవాడా?' చెప్పుమని, 'ఇరు సాంప్రదాయాలు, పద్దతులు కలిసిన ఈ స్థలములో పెరుగుతున్న విద్యార్థులకు సందేశము'ను ఇవ్వుమని కోరగా - అవధానిగారు 'మణివర్ణంబులు ...' పద్యమును, సంసారిగొప్ప అని, ఇరు సంప్రదాయములను గౌరవిస్తూ, అందులో మంచిని గ్రహిస్తూ జీవనం సఫలము చేసుకొనవలెనని పద్యరూపములో తెలియజేసారు.

**అప్రస్తుత ప్రసంగం** : ఈ అంశములో పృచ్ఛకుడు అడిగిన పలు ప్రశ్నలకు అవధానిగారు సరసమైన సమాధానములు ఇచ్చి ప్రేక్షకులను ముగ్ధులను చేసారు.

**ప్ర.** వ్యాకరణం చందోబద్ధంగా ఉండాలి. తానా, ఆటా కలిపితే?

**స.** తందానతాన.

**ప్ర.** మీ అర్ధాంగిగారి పేరు? మీ మేడసాని ఎవరు?

**స.** అర్ధాంగి పేరు అరుణజ్యోతి అని, మేడసాని తన కవితల దొరసాని అని సమాధానమిచ్చారు.

**ప్ర.** తిరుపతిలో ఏడుకొండలున్నాయి కదా! వాటి పేర్లు ఏమిటో కాస్త చెబుతారా?

**స.** వేంకటేశ్వర సుప్రభాతంలో

'శ్రీ శేషశైల గరుడాచల వేంకటాద్రి
నారాయణాద్రి, వృషభాద్రి వృషాద్రి ముఖ్యాం
ఆఖ్యాం త్వదీయవసతే రవిశం వదంతి
శ్రీ వేంకటాచలపతే తవసుప్రభాతమ్'

చదువుకుంటే ఏడు కొండల పేర్లు అందులో ఉన్నాయని తెలియజేసారు.

**ప్ర.** మేడసాని, మంగళంపల్లి, మధురాంతకం, మాడుగుల ఉపయోగించి నందమూరి గురించి పద్యమును చెప్పుమని అడుగగా

**స.** పద్యమును వెంటనే చెప్పారు.

ఇంకా ఎన్నో విషయములు అప్రస్తుత ప్రసంగములో చోటుచేసుకున్నా, వాటిని ఇక్కడ పొందుపరిచే అవకాశము కుదరలేదు. మొత్తము మీద ఈ అవధానములో ఎక్కువగా ఉత్పలమాల పద్యములు (4), ఒక చంపకమాల పద్యము వెలువడ్డాయి.

ఈ విధముగా అవధానము అద్యంతమూ ఆసక్తిని కలిగిస్తూ సాగింది.

జులై 28వ తేదీ సెయింట్ లూయిస్‌లో సంఘమిత్ర ఆద్వర్యములో, శ్రీనివాస రామానుజన్ మేధమేటిక్స్ క్లబ్(ఏడుగురు విద్యార్థులతో పాటు ఓ అధ్యాపకునితో) నిర్వహిస్తున్న 'మేధావధానము' విశేషాలు వచ్చే సంచికలో.